**అప్పట్లో ఎవరింటికి వెళ్లినా.. మనసాలలోనో, మధ్యహాల్లోనో పెద్దపెద్ద ఫొటోలు వేలాడదీసి కనిపించేవి. ధనవంతుల ఇళ్లల్లో.. ఆ ఫొటోల చుట్టూ అందమైన లతలు చెక్కిన కర్ర ఫ్రేములు ఉండేవి. ఎంత పెద్ద ఫొటోలుంటే.. అంత ధనవంతులన్న మాట. ఫొటో కింద ఫ్రేములో ఓ మూలకు ఆ ఫొటో తీసిన స్టూడియో పేరు, ఊరు వివరాలు ఉండేవి.**

# తొలి ఫొటో

మా మూలు వాళ్ల ఇళ్లల్లో కూడా గోడలకు, దూలాలకు, వాసాలకు మేకులు కొట్టి.. ఫొటోలు వేలాడదీసేవారు. అలాంటప్పుడు చనిపోయిన వాళ్లవి వేరే, బతికున్న వాళ్లవి వేరే లైన్‌లో ఉంచే పద్ధతి పాటించేవారు.

నేను ఎవరింటికి వెళ్లినా ముందు ఆ ఫొటోలే చూసే దాన్ని. మగవాళ్లయితే కమీజు, ధోవతి లేదా కుర్తా పైజామా, ఇంకా కొందరు షేర్వానీ ధరించి ఉండేవారు. ఇక ఆడవాళ్లయితే ఉన్న నగలన్నీ పెట్టుకునేవారు. ఎక్కువ శాతం ఆడవాళ్లు తొమ్మిది గజాల చీరలు మహారాష్ట్ర సంప్రదాయంలో కట్టుకుని ఉండేవారు. భార్యాభర్తల ఫొటోల్లో భర్త కుర్చీలో కూర్చుంటే భార్య ఆ పక్కనే నిలబడి ఉండటం మాత్రం నాకు నచ్చేది కాదు.

ఫొటోలు దిగడమంటే స్టూడియోకు వెళ్లి దిగడమే! అయితే చాలా ఫొటోలు పెళ్లిళ్లప్పుడు తీసినవే ఉండేవి. అంటే ఇప్పట్లా ప్రీ వెడ్డింగ్ షూట్స్, హల్దీలు, మంగళ స్నానాల ఫొటోలు తీసి పబ్లిక్‌గా పెట్టడం కాదు. కనీసం జీలకర్ర బెల్లం, మంగళ సూత్రధారణ లాంటివి కూడా తీసేవారు కారేమో! ఓ మాదిరి కలిగిన వాళ్లు పెళ్లిళ్లలాంటి శుభ సందర్భాలు అయిపోయిన ఓ పది రోజులకు ఫొటోగ్రాఫర్‌ను ఇంటికి పిలిపించి, ఫొటోలు తీయించుకునేవారు. అతను కెమెరాతోపాటు ఓ స్టాండు, ఫోకస్ లైటు, ఓ నల్లగుడ్డ తెచ్చుకునేవాడు. కెమెరాకూ తనకూ ఆ నల్లగుడ్డ కప్పుకొని ఫొటో తీసేవాడు.

వధూవరులిద్దరినీ, ఆ వరుసలోనే పెద్దవాళ్లందరినీ కుర్చీల్లో కూర్చోబెట్టి.. వెనుక నడి వయసువాళ్లు నిలబడేవాళ్లు. ఇక చిన్నపిల్లలకు దక్కేది కింద కూర్చునే సీటే కదా! వడ్డిస్తూ పప్పు గంటె పట్టుకుని అలాగే వచ్చిన వాళ్లూ, లడ్డూ తింటూ చేతిలో పట్టుకున్న చిన్న పిల్లవాడూ.. ఇలా అందరూ ఉండేవారు.

కొందరికి జీవితంలో ఒక్క ఫొటో కూడా తీసుకునే అవకాశం ఉండేది కాదు. అలాంటి వాళ్లు పోయినప్పుడు వాళ్ల కుటుంబసభ్యులు ఓ పక్కన ఏడుస్తూనే.. శవానికి బొట్టు పెట్టి, ఓ పూలదండ వేసి కుర్చీలో కూచోబెట్టి చుట్టూ నిలబడి ఫొటో దిగేవారు. కొందరిళ్లల్లో అలాంటి ఫొటోలు ఓ పక్కన విడిగా వేలాడేసేవారు.

మా ఊర్లో మొట్టమొదటిసారిగా వెంకట నారాయణ అనే అతను ఫొటో స్టూడియో పెట్టాడు. ఆయనకు నాన్నంటే ఎంతో ఇష్టం ఉండేది. ఓరోజు ఆయన మా ఇంటికి వచ్చి.. "నేను ఫస్ట్ ఫొటో మీ అమ్మాయిలదే తీస్త! వాళ్లిద్దర్నీ తయారు జేసి పంపండమ్మా!" అని అమ్మతో, "మీరు ఎంటబెట్టుకుని రాండి దొరా!" అని నాన్నకూ చెప్పి వెళ్లాడు. మాకు చెప్పలేనంత సంతోషం వేసింది. నాకప్పుడు నాలుగేళ్లు ఉంటాయేమో! డార్క్ కాఫీ కలర్ గౌన్లు మాకిద్దరికీ ఒకేలాంటివి వేసి.. రెండు జడలు వేసి, తెల్ల రిబ్బన్లు కట్టి, దోసపలుకు ఆకారంలో బొట్టు పెట్టి తయారుచేసింది అమ్మ. తీరా బయల్దేరేటప్పుడు నా చెప్పులు (అప్పట్లో స్లిప్పర్లే) ఎంత వెతికినా కనిపించలేదు. "ఏమాయె! ఆలస్యం అయితున్నది" అని నాన్న తొందరపెట్టేసరికి నాకు గుర్తొచ్చింది. అంతకు వారం కిందనే ఊరెళ్తూ చెప్పుల్లేవని బాధపడ్తుంటే.. మా అత్త కొడుకు మధుకు ఇచ్చేశానని!


"సరె! ఇస్తె ఇచ్చినవ్ తియ్యి! అట్లనే నడిచిరా మరి!" అని నాన్న మమ్మల్నిద్దరినీ వెంటబెట్టుకుని.. కిలోమీటర్ దూరంలో ఉన్న స్టూడియోకు తీసుకువెళ్లాడు. తీరా అక్కడ ఫొటో తీసేటప్పుడు.. "అయ్యో! నీ చెప్పులేవమ్మా?" అని ఆయన అడిగాడు. లేవని నాన్న చెప్పాడు. అక్క చెప్పులతోనే ఫొటో దిగుతానంది. ఒకళ్లు చెప్పులేసుకుని, మరొకరు వేసుకోకుండా ఉంటే బాగుండదని.. వెంకట నారాయణ ఆలోచించి వాళ్ల కొడుకు ప్రభాకర్‌ను పిలిచాడు. ఫొటో స్టూడియో పేరు కూడా 'ప్రభాకర్ ఫొటో స్టూడియో'నే. ప్రభాకర్ నా క్లాస్‌మేట్. వెంటనే తన స్లిప్పర్లు ఇచ్చాడు. అవి అక్క స్లిప్పర్ల కన్నా పెద్దగా ఉన్నా.. ఆనందంగా వాటిని వేసుకున్నాను. మాకిద్దరికీ ఒక హాఫ్ సైజు, ఇంకో ఫుల్‌సైజు ఫొటో తీశాడు. ఎవరైనా నవ్వమనగానే.. పెదవులు – చెవుల దాకా వచ్చేటట్టు నవ్వేదాన్ని నేను. ఆ ఫొటోలో నేను నవ్వుతూ ఉంటాను. అమాయకంగా అక్కా, నేనూ 'లేత మనసులు'లో పప్పీ, లల్లీల్లాగా ఉంటాము. నా సింగిల్ ఫొటోను స్టూడియో వాళ్లు టేబుల్ గ్లాస్ కింద అడ్వర్‌టైజ్మెంట్ కోసం పెట్టుకున్నారు.

మరో మూడేళ్లకు నాకు పేలు బాగా పడి ఎంతకూ తగ్గకపోతే.. బాయ్ కట్ చేయించారు. రెండో మూడో అంగీ లాగూలు కూడా కొన్నారు. ఆ డ్రెస్సుతో ఫొటో తీయిద్దామని మళ్లీ ప్రభాకర్ స్టూడియోకే తీసుకెళ్లారు నాన్న. ఆ ఫొటోలో చూస్తే నన్నెవరూ అమ్మాయి అనుకోరు. అక్కా తమ్ముడులాగా కనిపిస్తామందులో. ఈ ఫొటోలన్నీ మా ఇంట్లో గోడకు వేలాడేసి ఉండేవి.

మావి ఎన్నో ఫొటోలు వెంకట నారాయణే తీశాడు. హై స్కూల్లో ప్రతి పదో తరగతి బ్యాచ్ వీడ్కోలు రోజున గ్రూప్ ఫొటో ఆయన తీయాల్సిందే! ఆయనదంటూ ఒక స్టాండర్డ్ పోజు ఉండేది. అందరూ కూర్చున్నాక ఎవరి మోకాళ్ల మీద వాళ్ల రెండు అరచేతులూ పెట్టుకోవడం. ఇది తప్ప వేరే పోజు ఆయన ఒప్పుకొనేవాడు కాదు. తరువాత రోజుల్లో అందరూ కలిసినప్పుడు.. మేము సొంత కెమెరాతో ఫొటోలు దిగినప్పుడు.. "వెంకట నారాయణ పోజులో కూర్చోండి" అని ఎవరో ఒకరు అనగానే అందరం నవ్వేసేవాళ్లం. ఆ తరువాత ఉదయశ్రీ, మయూరి స్టూడియోలు వెలిశాయి. నా పెళ్లి ఫొటోలు ఉదయశ్రీ వాళ్లే తీశారు. ఇప్పుడు ప్రభాకర్ స్టూడియో, ఉదయశ్రీ అన్నీ మూతపడ్డాయి.

కొన్నాళ్ల తరువాత ఆల్బమ్‌లో మా చిన్నప్పటి ఫొటోలతోబాటు తరువాత దిగిన మరికొన్ని ఫొటోలు అతికించి.. అప్పుడప్పుడూ చూసి ఆనందించేవాళ్లం నేనూ, అక్కా. ఎనభైల్లో అనుకుంటా.. ఒకేడు వర్షాలు బాగా పడ్డాయి. ఎందుకో ఓ నెల రోజులపాటు ఆల్బమ్స్ గానీ, అలమరాలో ఉన్న మరే పుస్తకాలు గానీ చూడలేదు. తరువాత చూస్తే ఏముందీ.. మొత్తం చెదలు పట్టిపోయాయి. ఆల్బమ్ పాడై అందులో మా ఫొటోలు ఏ మాత్రం ఆనవాళ్లు లేకుండా పోయాయి. వాళ్ల నాన్న చనిపోయాక ప్రభాకరే ఆ స్టూడియోను నడుపుతుండేవాడు. అతణ్ని కూడా నా ఫొటో ఉందేమోనని అడిగాను. "అయ్యో! మొన్ననే స్టూడియో అంతా మార్చినప్పుడు చిరిగిపోతే తీసేశాం" అన్నాడు. ఎంతో బాధపడ్డా.. ఏమీ చేయలేకపోయాం.

ఇప్పుడు ఎన్నో కెమెరాలు, సెల్‌ఫోన్లతో లెక్కలేనన్ని ఫొటోలు దిగినా.. ఆ ఫొటోలతో ఉన్న అనుబంధం, ఆ జ్ఞాపకాలు మాత్రం తిలక్ చెప్పినట్లు ఆనందం లాంటి విచారాన్ని కలిగిస్తాయి. ■





నెల్లుట్ల రమాదేవి
రచయిత్రి